www.prajasakti.com

ప్రజాశక్తి

గురువారం 29 జూన్ 2023

5

172వ రోజుకు గడపగడపకూ మన ప్రభుత్వం

ప్రజాశక్తి - భీమడోలు

ఉంగుటూరు ఎంఎల్‌ఎ పుప్పాల వాసుబాబు నిర్వహిస్తున్న గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం 172వ రోజు బుధవారం పూళ్ల పంచాయతీలో నిర్వహించారు. ఇటీవల పకృతి వైపరీత్యాల కారణంగా విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు పాడై విద్యుత్ సరఫరా సమస్యలు ఏర్పడడంతో స్థానిక సొసైటీ అధ్యక్షులు కందులపాటి శ్రీనివాసరావు, గ్రామ సర్పంచి దాయం సుజాత ప్రసాద్ సమస్యను ఎంఎల్‌ఎ దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై స్పందించిన ఎంఎల్‌ఎ వడ్డిగూడెం, పూళ్ల గ్రామ శివార్లలోని పలు ప్రాంతాలల్లో సుమారు 650 విద్యుత్ సర్వీసులకు లో వోల్టేజీ సమస్య, ఇతర సమస్యల పరిష్కారానికి ట్రాన్స్ కో అధికారులతో మాట్లాడారు. సమస్య పరిష్కారానికి ఇపిడిసిఎల్ రూ.25 లక్షలను కేటాయించింది. ఈ రెండు ప్రాంతాల్లో 63 కెవి ట్రాన్స్ ఫారం, మూడు 40 కెవి సామర్థ్యం గల ట్రాన్స్‌ఫార్మర్లు, కిలోమీటరు పొడవున పాడైన విద్యుత్ లైన్ల కండక్టర్లను మార్చారు. వీటిని ఎంఎల్‌ఎ ప్రారంబించారు.

అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం..!

గిరిజన గ్రామాలు, పునరావాస కాలనీల మీదుగా సాగిన పాదయాత్ర

నిర్వాసితులకు ధైర్యం చెబుతూ సాగిన 'పోలవరం పోరుకేక'
వంకావారిగూడెంలో విద్యార్థులతో శ్రీనివాసరావు మాటామంతి
గోడు వింటూ.. సమస్యలు పరిశీలిస్తూ సాగిన మహా పాదయాత్ర
గ్రామగ్రామాన మహిళలు, చిన్నారులు ఎదురెళ్లి ఘనస్వాగతం

విక్రమ్‌సింగ్

దడాల సుబ్బారావు

ఆంధ్ర మల్లాద్రి

మంతెన సీతారాం

తెల్లం దుర్గారావు

ప్రజాశక్తి - టి.నరసాపురం, జీలుగుమిల్లి

పోలవరం నిర్వాసితుల సమస్యలు పరిష్కారం కోరుతూ సిపిఎం చేపట్టిన 'పోలవరం పోరుకేక' మహా పాదయాత్ర జిల్లాలో మూడోరోజు బుధవారం అత్యంత ఉత్తేజభరితంగా సాగింది. నిర్వాసితుల సమస్యలు వింటూ.. వాటిని పరిశీలిస్తూ నేతలు నిర్వాసితులకు ధైర్యం చెబుతూ సాగుతున్న యాత్రలో 'మేమున్నాం.. అధైర్య పడొద్దు.. అండగా ఉంటాం.. పోరుబాట పడితే సమస్యలవే పరిష్కారమవుతాయి' అంటూ దిశా నిర్దేశం చేస్తూ నేతల ప్రసంగాలు పోరాట స్ఫూర్తిని నింపుతున్నాయి. పాదయాత్రకు మహిళలు, చిన్నారులు ఎదురెళ్లి అడుగడుగునా పూలదండలు వేసి, తిలకం దిద్ది హారతులిచ్చి ఘన స్వాగతం పలికారు.

జీలుగుమిల్లి మండలం కామయ్యపాలెంలోని మామిడిగొందిలో మూడోరోజు బుధవారం ప్రారంభమై పాదయాత్ర బర్రింకలపాడు, వంకావారిగూడెం, మడకంవారిగూడెం, చీమలవారిగూడెం, పునరావాస కాలనీల మీదుగా కొరుటూరు కాలనీలు చేరుకుని రాత్రి బస చేసింది. పోరెడ్డిగూడెం, కట్కూరు పునరావాస గ్రామాల నిర్వాసితులు పాదయాత్ర బృందానికి తమ సమస్యలు చెప్పుకున్నారు. ఇప్పటికీ పరిహారం అందలేదని, కాలనీల్లో తాగునీరు, విద్యుత్, వైద్యం వంటి సమస్యలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. దీనిపై సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి సిపిఎం చేపట్టే పోరాటాల్లో నిర్వాసితులంతా కలిసి రావాలని, సమస్య పరిష్కారమయ్యే వరకూ ఎర్రజెండా విశ్రమించదని చెప్పారు. సమస్యలను కెఆర్‌పురం ఐటిడిఎ పిఒకు ఫోన్ చేసి వివరించారు. వెంటనే సమస్యలు పరిష్కరించాలని కోరారు. యాత్రలో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు విక్రమసింగ్ పాల్గొని సమస్యలు పరిశీలించడంతోపాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలు ఎండగడుతూ నిర్వాసితులు చేపట్టాల్సిన పోరు గురించి దిశానిర్దేశం చేశారు. బర్రింకలపాడు రింగు రోడ్డు వద్ద ప్రజాశక్తి బృందం పాదయాత్రకు సంఘీభావం తెలిపింది. ప్రత్యేక హోదా సాధన సమితి కన్వీనర్ చలసాని శ్రీనివాసరావు బుధవారం మధ్యాహ్నం వరకూ పాదయాత్రలో పాల్గొన్నారు. వంకావారిగూడెంలో ఫౌండేషన్ పాఠశాలలో గిరిజన విద్యార్థులతో శ్రీనివాసరావు కొద్దిసేపు ముచ్చటించారు. ఎస్ఎఫ్ఐ, కెవిపిఎస్, వ్యకాస, సిఐటియు రాష్ట్ర నేతలతోపాటు పశ్చిమగోదావరి, అల్లూరి సీతారామరాజు, కాకినాడ, కోనసీమ, ఎన్‌టిఆర్ జిల్లాల నేతలు ఈ యాత్రలో పాల్గొని నిర్వాసితుల సమస్యలపై నినదించారు. కళాకారుల కళారూపాల ప్రదర్శన, ఆలపించిన గీతాలు ఆకట్టుకోవడంతోపాటు ఆలోచింపజేశాయి. ఈ యాత్రలో భాగంగా ఆయా గ్రామాలు, కాలనీల్లో జరిగిన సభల్లో విక్రమ్‌సింగ్, శ్రీనివాసరావుతోపాటు సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం, వి.వెంకటేశ్వర్లు, బి.తులసీదాస్, కె.సుబ్బరావమ్మ, వై.వెంకటేశ్వరరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు వై.అచ్యుతరావు, జయరాం, కె.హరికిషోర్, బి.బలరాం, ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి, జిల్లా నేతలు పాల్గొన్నారు.

యాత్రలో అగ్రనేతలు

కళాకారుల ఆటాపాట

నీటి సమస్యను పరిశీలిస్తున్న నేతలు

పోలవరంలో పోరుకేక ఉపయాత్రను ప్రారంభిస్తున్న వై.వెంకటేశ్వరరావు

ఉత్సాహంగా అడుగులేస్తూ..

పోలవరంలో ప్రారంభమైన 'పోరుకేక' ఉపయాత్ర

ప్రజాశక్తి - పోలవరం

పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల సమస్యలపై సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన పోరుకేక ఉపయాత్ర బుధవారం ప్రారంభమైంది. మొదటి రోజు పాదయాత్ర ఉత్సాహంగా సాగింది. తొలుత జెండా ఊపి యాత్రను సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు ప్రారంభించారు. అనంతరం ఈ యాత్ర పోలవరం నిర్వాసితుల పునరావాస కాలనీల గుండా సాగింది. దేవరగొంది, తోటగొంది, రామయ్యపాలెం, చేగొండిపల్లి, సింగన్నపల్లి, మామిడిగొంది కాలనీల గుండా సాగి దొండపూడి మీదుగా కొత్తూరు, కొండ్రుకోట, మాదాపురం, తెల్లవరం, గాజులగొంది గ్రామాల పునరావాస కాలనీకి చేరుకుంది. ఈ యాత్ర దళానికి సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కె.శ్రీనివాస్, తామా ముత్యాలమ్మ, గుడెల్లి వెంకట్రావు నాయకత్వం వహిస్తున్నారు. ఆయా గ్రామాల్లో నిర్వాసితులు తమ సమస్యలను యాత్ర బృందానికి చెప్పుకున్నారు. యాత్ర బృంద సభ్యులకు వారి గోడు విన్నవించుకున్నారు. పోలవరం మండలంలో 21 నిర్వాసిత గ్రామాలను ఖాళీ చేయించి పునరావాస కాలనీలకు బలవంతంగా తరలించారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ గ్రామాల్లో జీవనానికి ఎటువంటి ఇబ్బంది ఉండేది కాదని చెప్పారు. రామయ్యపాలెం కాలనీకి సంబంధించిన కొరస వెంకటేశ్వరరావు మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన వారికి కట్టాల్సిన పునరావాస ఇల్లు నిర్మించడం లేదని వాపోయారు. చేగొండపల్లి పునరావాస కాలనీలో మిడియం రామచల్లయమ్మకు ప్రభుత్వం కట్టి ఇవ్వాల్సిన ఇల్లు ఇవ్వలేదని, దీంతో ఆరుకు ఇళ్లలో సర్దుకుని జీవిస్తున్నామని వాపోయారు. సింగన్నపల్లి పునరావాస కాలనీలో సున్నం ఆదిలక్ష్మి మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన తమకు ఇల్లు నిర్మించకుండా అధికారులు తిప్పించుకుంటున్నారని, ఉండడానికి ఇల్లు లేక అద్దె ఇంటిలో ఉంటున్నామని చెప్పారు. ఆయా గ్రామాల్లో జరిగిన సభల్లో కె.శ్రీనివాస్, గుడెల్లి వెంకట్రావు, తామా ముత్యాలమ్మ మాట్లాడుతూ పోలవరం నిర్వాసితుల పట్ల ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నారు. ఇప్పటికైనా నిర్వాసితులకు 2013 భూసేకరణ చట్టప్రకారం పరిహారం, పునరావాసం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ పాదయాత్రలో నిర్వాసిత గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నిర్వాసితులకు న్యాయం చేయాలి

బొడ్డు కృష్ణ, టిడిపి మండలాధ్యక్షులు, పోలవరం

నిర్వాసితుల కోసం సిపిఎం పోరాటం అభినందనీయం. నిర్వాసితులకు న్యాయం జరిగేలా వైసిపి ప్రభుత్వాన్ని మొద్దు నిద్ర నుంచి లేపడానికి పోరుకేక యాత్ర దోహదపడుతుంది. నిర్వాసితులకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలి.

1,72,956 మందికి అమ్మఒడి

లబ్ధిదారుల ఖాతాల్లో రూ.259.43 కోట్లు జమ

ప్రజాశక్తి - ఏలూరు

జగనన్న అమ్మఒడి పథకం నాలుగో విడతలో 2022-23 సంవత్సరానికి జిల్లాలో 1,72,956 మంది తల్లుల ఖాతాల్లో రూ.259.43 కోట్లు ఆర్థిక సాయం జమ అయినట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ బి.లావణ్య వేణి తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో అమ్మఒడి ఆర్థిక సహాయం పంపిణీ జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జెసి బి.లావణ్యవేణి, జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ గంట పద్మశ్రీ, డిఆర్‌ఒ ఎవిఎన్ఎస్.మూర్తి, జిల్లా విద్యాశాఖ అధికారి రవి సాగర్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సిఎం జగన్ పార్వతీపురం మన్యం జిల్లా కురుపాంలో పాల్గొన్న రాష్ట్రస్థాయి అమ్మఒడి సహాయ పంపిణీ కార్యక్రమ ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించారు. జిల్లాలో అర్హత కలిగిన 1,72,956 మంది తల్లుల ఖాతాలకు ముఖ్యమంత్రి బటన్ నొక్కడం ద్వారా జమ చేసిన రూ.259.43 కోట్లు మొత్తానికి నమూనా చెక్కును విద్యార్థులు, తల్లుల బృందానికి అందజేశారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యాపరంగా అనేక సౌకర్యాలు కల్పిస్తుందన్నారు. అమ్మ ఒడి ద్వారా విద్యార్థుల తల్లుల ఖాతాలకు రూ.15 వేలు ప్రభుత్వ ప్రోత్సాహం అందిస్తుందని తెలిపారు. దీని ద్వారా గతంలో పోల్చుకుంటే ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే పిల్లల సంఖ్య గణనీయంగా పెరిగిందని తెలిపారు. సాంకేతికపరమైన విజ్ఞానం సంపాదించడానికి ఇంగ్లీష్ మీడియంలో పాఠశాలలు నడిపిస్తున్నారని, అలాగే ట్యాబ్‌ల ద్వారా విద్యార్థులకు బైజూస్ లెర్నింగ్ యాప్‌ల మరింత లోతుగా పాఠాన్ని అధ్యయనం చేయొచ్చన్నారు. జెడ్‌పి ఛైర్‌పర్సన్ పద్మశ్రీ మాట్లాడుతూ అమ్మ ఒడి ప్రోత్సాహకాన్ని పిల్లల విద్యకు మాత్రమే ఖర్చు చేయాలని సూచించారు. పేద పిల్లల చదువు ద్వారా వారి భవిష్యత్తును తీర్చిదిద్దడానికే ప్రభుత్వం ఎంతోకృషి చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐఒ చంద్రశేఖర్, డిఇవిఒ ప్రభాకర్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రంథాలయాన్ని అభివృద్ధి చేయాలి

ఏలూరు అర్బన్: ప్రముఖ అభ్యుదయ వాది సిపిఐ అభిమాని బొమ్మి రంగారావు ఆశయాలకు అనుగుణంగా కొత్తపేట గ్రంథాలయాన్ని అభివృద్ధి చేయాలని సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు తెలిపారు. బుధవారం ఉదయం స్థానిక కొత్తపేట బొమ్మి రంగారావు స్మారక గ్రంథాలయం వద్ద రంగారావు 28వ వర్ధంతిని బొమ్మి రంగారావు ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించారు. రంగారావు చిత్రపటానికి వారి తనయుడు, ట్రస్ట్ బోర్డు ఛైర్మన్ బొమ్మి మురళీ పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి ట్రస్ట్ బోర్డ్ కార్యదర్శి చింతల సూర్యనారాయణ అధ్యక్షత వహించారు. బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ 48 ఏళ్లుగా కొత్తపేటలో సిపిఐ, ఎఐవైఎఫ్ ఆధ్వర్యంలో గ్రంథాలయం నిర్వహిస్తున్నారన్నారు. రంగారావు కుటుంబ సభ్యులు ట్రస్ట్‌ను ఏర్పాటు చేసి గత మూడు దశాబ్దాలుగా ఆటంకం లేకుండా నిర్వహిస్తున్నారని అభినందించారు. ఎఐటియుసి నాయకులు కడుపు కన్నయ్య, పుప్పాల కన్నబాబు, ట్రస్ట్ అధ్యక్ష, కార్యదర్శులు బొమ్మి మురళీ, చింతల సూర్యనారాయణ మాట్లాడారు. అనంతరం చోడిదిబ్బ నరసింహం మున్సిపల్ ప్రాథమిక ఉన్నత పాఠశాల విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు బహూకరించారు.

మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ

పోలవరం : ఒఎన్‌జిసి, కెజి బేసిన్ చెన్నై, కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబుల్ వారి సహకారంతో కోండ్రుకోట పునరావాస కాలనీ మహిళలకు నిర్వహిస్తున్న కుట్టు మిషన్ల శిక్షణ ముగిసింది. 60 రోజులు పాటు శిక్షణ పూర్తి చేసుకున్న 30 మంది మహిళలకు బుధవారం ఐటిడిఎస్ సేవా సంస్థ డైరెక్టర్ జి.అనిల్ కుమార్ ఆధ్వర్యంలో ఒఎన్‌జిసి బేసిన్ మేనేజర్ కె.కరవణ్ణన్, సిఎస్‌ఆర్ ఇన్‌ఛార్జి జయంతి లక్ష్మణ్, ఎంపిపిల సంఘం జిల్లా అధ్యక్షులు సుంకర వెంకటరెడ్డి 30 కుట్టుమిషన్లు, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపిపి సుంకర వెంకటరెడ్డి మాట్లాడుతూ ఏజెన్సీ గ్రామాల మహిళలకు సహకారం అందిస్తున్న ఒఎన్‌జిసి మేనేజర్, సిఎస్‌ఆర్ ఇన్‌ఛార్జులను, ఐటిడిఎస్ సేవా సంస్థ డైరెక్టర్‌ను అభినందించారు.

విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని వినతి

ఏలూరు అర్బన్: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పిడిఎస్‌యు ఆధ్వర్యంలో బుధవారం డిఇఒ కార్యాలయం ముందు నిరసన తెలిపారు. అనంతరం అధికారులకు వినతిని అందించారు. ఈ సందర్భంగా పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షులు కాకి నాని మాట్లాడుతూ ఈనెల 20 నుంచి 27వ తేదీ వరకూ ప్రభుత్వ పాఠశాలల్లో సర్వే నిర్వహించామని, ఈ సర్వేలో అనేక అంశాలు పిడిఎస్‌యు దృష్టికి విద్యార్థులు తీసుకొచ్చారని తెలిపారు. అనేకచోట్ల జగనన్న విద్యా కానుక అందకపోవడాన్ని గుర్తించామని, ఇచ్చిన బ్యాగులు నాణ్యత లేకపోవడం వల్ల చిరిగిపోతున్నాయని, జిప్పులు త్వరగాపోతున్నాయని విద్యార్థులు తెలియజేశారన్నారు. అనేక పాఠశాలలో నాడు - నేడు పనులు పూర్తికాకపోవడంతో తరగతి గదులు అందుబాటులో లేక విద్యార్థులకు సరిగా క్లాసులు జరగడం లేదన్నారు. జిల్లా పరిషత్ పాఠశాలల్లో బాలురకు మరుగుదొడ్లు లేకపోవడంతో ఆరుబయటే కాలకృత్యాలు తీర్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రయివేటు, కార్పొరేట్ విద్యాసంస్థల్లో పది శాతం నుంచి 30 శాతం ఫీజులు పెంచి తల్లిదండ్రులను నిలువుదోపిడీ చేస్తున్నారని విమర్శించారు.

నిర్వాసితుల గోడు పట్టదా..!

సమస్యల వలయంలో పోలవరం నిర్వాసితుల కాలనీలు
ఏళ్లు గడుస్తున్నా వసతులు కల్పించని పరిస్థితి
పూర్తికాని బడి, గుడి, కమ్యూనిటీ హాలు, హెల్త్ సెంటర్లు
అందని పరిహారం, వరద సాయం, పథకాలు
సర్టిఫికెట్ల కోసం నరకయాతన
చినుకుపడితే ఇళ్లల్లోకి నీళ్లు
వెంటాడుతున్న శ్మశాన వాటిక సమస్య
ఎక్కడున్నాయో తెలియని ఆర్‌అండ్‌ఆర్ భూములు

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

పోలవరం ప్రాజెక్టు కోసం సర్వం త్యాగం చేసిన నిర్వాసితులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గాలికొదిలేశాయి. ఏళ్ల తరబడి ఉన్న ఇళ్లను, సాగుభూములను, ఉపాధిని వదిలేసి ప్రాజెక్టు నిర్మాణానికి ప్రభుత్వాలకు సహకరించిన వారిని నిలువునా ముంచేశాయి. వారికి ఇస్తామన్న పరిహారం లేదు.. కల్పిస్తామన్న పునరావాసం లేదు.. చూపిస్తామన్న ఉపాధీ లేదు.. దీంతో వారంతా నరకయాతన అనుభవిస్తున్నారు. ఉపాధి లేక కడుదయనీయ పరిస్థితులను ఎదుర్కొంటున్నారు.

పోలవరం ప్రాజెక్టు నిర్మాణంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రతిపక్ష పార్టీలు నిత్యం చర్చోపచర్చలు చేస్తున్నాయీ.. చేస్తూనే ఉన్నారు.. కానీ ప్రాజెక్టు నిర్మాణం కోసం సర్వస్వం త్యాగం చేసి పునరావాస కాలనీలకు తరలివచ్చిన ఆ త్యాగధనులకు కష్టాలు, కన్నీళ్లు మాత్రమే మిగిలాయి. పునరావాస కాలనీలకు వచ్చి ఏళ్లు గడుస్తున్నప్పటికీ కనీస వసతులు కల్పించలేదు. దీంతో ఆయా కాలనీల్లో నానా అవస్థలు పడుతూ కాలం వెళ్లదీస్తున్నారు. 2013 భూ సేకరణ చట్టం ప్రకారం పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు కల్పించాల్సిన వసతులు, పరిహారంపై ప్రజాప్రతినిధులు, అధికారులు కనీసం మాట్లాడటం లేదు. సమస్యల పరిష్కారానికి ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదు. బుట్టాయగూడెం మండలంలో ఏర్పాటు చేసిన నిర్వాసిత కాలనీలకు వేలేరుపాడు, పోలవరం మండలాల నిర్వాసితులను తరలించారు. ములగలగూడెం, తూటికుంట, తెల్లవరం, పైడాకులమామిడి, పల్లవూరు, చిగురుమామిడి, శ్రీరామపురం, తెల్లదిబ్బలు, సరుగుడు, ఎడవల్లి, బోలపల్లి గ్రామాల నుండి రెడ్డిగణపవరం పరిధిలోని నాలుగు పునరావస కాలనీలకు 540 కుటుంబాలు వచ్చి నివాసం ఉంటున్నాయి. బుట్టాయగూడెం పరిధిలో మూడు కాలనీలకు 70 కుటుంబాలు, సింగనపల్లి కాలనీకి 60 కుటుంబాలు, దొరమామిడిలోని రెండు కాలనీలకు 60 కుటుంబాలు వచ్చాయి. మండల పరిధిలో మొత్తం 11 పునరావాస కాలనీలున్నాయి. వీటిలో మొత్తంగా 720 కుటుంబాలు కాలనీలకు వచ్చి నివాసం ఉంటున్నాయి. అయితే ఈ కాలనీల్లో పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పించకపోవడంతో వారు నానాఅవస్థలు పడుతున్నారు. వర్షాకాలంలో పరిస్థితి మరింత దారుణంగా ఉంటుంది. చిన్నపాటి వర్షానికి కాలనీల చుట్టూ వర్షపు నీరు చేరుతోంది. సరైన డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగునీరు, వర్షపు నీరు ఇళ్ల మధ్యనే ఉంటుంది. ఈ సమస్యలను ఉన్నతాధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని నిర్వాసితులు వాపోతున్నారు.

అందని ప్యాకేజీ

ముప్పినవారిగూడెం సమీపంలోని చిగురుమామిడి నిర్వాసిత కాలనీలో 60 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. అయితే ఈ కుటుంబాల్లోని 35 మందికి ప్రభుత్వం అందిస్తామన్న ప్యాకేజీ ఇవ్వలేదు. దీంతో దాని కోసం ఆ కుటుంబాలు అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నా కనీసం పట్టించుకోవడం లేదు. అలాగే ఈ కాలనీకి ఇటీవల వరకూ శ్మశాన వాటికి లేదు. శ్మశాన వాటిక ఏర్పాటు చేయాలని పలుమార్లు బుట్టాయగూడెం తహశీల్దార్ దృష్టికి తీసుకెళ్లగా వారికి ముప్పినవారిగూడెం సమీపంలో రెండు ఎకరాలను శ్మశానవాటికకు కేటాయించారు. అయితే ఐదు నిర్వాసిత కాలనీలకు రెండు ఎకరాలు మాత్రమే కేటాయించడంతో నిర్వాసితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ భూమి ఏవిధంగా సరిపోతుందని నిర్వాసితులు వాపోతున్నారు.

శ్మశానవాటిక కేటాయించలేదు

తూటిగుంట నిర్వాసిత కాలనీకి ఇప్పటికీ శ్మశాన వాటిక కేటాయించలేదు. అధికారుల, ప్రజాప్రతినిధుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదు. కనీసం వీధిలైట్లు కూడా ఏర్పాటు చేయలేదు. దీంతో రాత్రి సమయంలో ఇబ్బందులు పడుతున్నామని కాలనీవాసులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. బుట్టాయగూడెం మండలంలోనే నివాసం ఉంటున్న ఎంఎల్‌ఎ తెల్లం బాలరాజు తమ కాలనీల గుండా నిత్యం ప్రయాణం చేస్తూ ఉంటారని, అయినా కూడా తమ సమస్యలను ఆయన పట్టించుకోవడం లేదని పలువురు వాపోతున్నారు. కాలనీకి తరలించిన తర్వాత కనీసం ఒక్కసారి కూడా తమ వద్దకు వచ్చి సమస్యలు అడిగి తెలుసుకోలేదని నిర్వాసితులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

సారూ.. మా భూములు ఎక్కడున్నాయో హద్దులు చూపండి

నిర్వాసితులకు కేటాయించిన భూమికి సరిహద్దులు చూపించాలని తహశీల్దార్‌కు, ఆర్‌డిఒకు, ఐటిడిఎ పిఒ దృష్టికి పలుమార్లు తసుకెళ్లినా పట్టించుకోవడం లేదని కాలనీవాసులు తెలిపారు. దయచేసి తమ భూములకు హద్దులు చూపాలని వేడుకుంటున్నారు. వారికి భూములు ఎక్కడ ఉన్నాయో ఇప్పటికీ తెలియని పరిస్థితి నెలకొంది. అంతేకాకుండా వివాదాల్లో ఉన్న భూములను ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ద్వారా కొనుగోలు చేసి నిర్వాసితులకు ఇవ్వడంతో వారు ఇబ్బందులు పడుతున్నారు.

నిర్వాసిత కాలనీలకు తరలించే నాటికి 18 సంవత్సరాల నిండిన వారికి ప్యాకేజీ ఇవ్వాల్సి ఉంది. కానీ చిగురుమామిడికి చెందిన 20 మంది యువతీ యువకులు 18 సంవత్సరాలు నిండినవారు ఉన్నారని వారికి ప్యాకేజీ ఇవ్వాలని కోరుతున్నారు. నిర్వాసితులు గతంలో అడవి నుండి కట్టెలు కొట్టుకుని వాటి ద్వారా వంట చేసుకునేవారు. కానీ నిర్వాసిత కాలనీలకు వచ్చిన తరువాత వారు వంట చేసుకోవడానికి ఇబ్బంది పడుతున్నారు. అడవి నుండి కట్టెలు కొట్టుకోవడానికి నిర్వాసితులకు అవకాశం కల్పించాలని కోరుతున్నారు.

ఏర్పాటు చేయని బడి, గుడి

నిర్వాసిత కాలనీలకు బడి, గుడి ఏర్పాటు చేయకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాల లేకపోవడంతో దూరప్రాంతాల్లోని స్కూళ్లకు పిల్లలను పంపించడానికి తల్లిదండ్రులు ఇష్ట పడటం లేదు. దీంతో అనేక మంది చదువుకు దూరమవుతున్నారు. ప్రభుత్వం స్పందించి నిర్వాసిత కాలనీల్లో పాఠశాలల నిర్మాణం త్వరితగతిన చేపట్టాలని కోరుచున్నారు.

అందని వరదసాయం

గత ఏడాది వచ్చిన గోదావరి వరదలకు ప్రభుత్వం ప్రకటించిన సాయం నేటికీ అందలేదు. అలాగే జగన్ ప్రభుత్వం ప్రకటించిన రూ.10 లక్షల పరిహారం కూడా పూర్తిస్థాయిలో అందలేదు. పునరావాస కాలనీల్లో 26 రకాల సదుపాయాలు కల్పిస్తామని చెప్పిన వాటిలో 25 రకాల వసతులను కల్పించలేదని, దిక్కుతోచని స్థితిలో పునరావాస కాలనీలకు వచ్చామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇన్ని ఇబ్బందులుంటే ఇక్కడికి వచ్చే వారం కాదని వారు వాపోతున్నారు.

నిర్వాసితుల దరిచేరని ప్రభుత్వ పథకాలు

ప్రభుత్వ పథకాలు నిర్వాసితులకు అందడం లేదు. అలాగే ప్రభుత్వం నుండి సర్టిఫికెట్లు పొందేందుకు నరకయాతన అనుభవిస్తున్నారు. బుట్టాయగూడెం మండలం నుంచి వారివారి మండలాలకు వెళ్లడానికి ఎంతో వ్యయంతో కూడుకున్న పని అని, ప్రభుత్వం స్పందించి ప్రభుత్వ పథకాలు, సర్టిఫికెట్లను స్థానికంగా ఉన్న మండలస్థాయి అధికారుల ద్వారా అందించే ఏర్పాట్లు చేయాలని కోరుతున్నారు.

వర్షం వస్తే గదుల్లోకి నీరు

చిన్నపాటి వర్షం వస్తే నిర్వాసితుల ఇళ్లల్లోకి నీరు చేరుతోంది. దీంతో వారు నానాఅవస్థలు పడుతున్నారు. నాణ్యత లేకుండా ఇంటి నిర్మాణాలు చేపట్టారని వారు వాపోతున్నారు.

మా భూములకు హద్దులు చూపండి

చిచ్చటి సీతయ్య, చిగురుమామిడి నిర్వాసిత కాలనీ



మాకు ఆర్‌అండ్‌ఆర్‌లో కేటాయించిన భూములు ఎక్కడ ఉన్నాయో మాకు తెలియదు. దయచేసి రెవెన్యూ అధికారులు సరిహద్దులు చూపి, రాళ్ళు వేసి అప్పగించండి. దీనిపై పలుమార్లు ఐటిడిఎ పిఒను కోరినా, తహశీల్దార్ దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదు.

విఎస్‌ఎస్ వాటా ఇప్పించండి

ముచ్చిక కృష్ణ, సరుగుడు నిర్వాసిత గ్రామం

మా సరుగుడు గ్రామానికి విఎస్‌ఎస్ ద్వారా అటవీ సంపదలో కొంత భాగం గ్రామానికి వచ్చేది. కానీ నేడు నిర్వాసిత ప్రాంతానికి రావడం వల్ల ఆ సంపదలోని వాటాను కోల్పోయాము. వన సంరక్షణ సమితి ద్వారా సుమారు 600 ఎకరాల అటవీ భూమిలోని ఉత్పత్తుల ద్వారా మా గ్రామానికి వచ్చే ఆదాయం లెక్కగట్టి మాకు ఇవ్వాలి.

25 రకాల వసతులు కల్పించాలి

ఎ.రవి, సిపిఎం జిల్లా కార్యదర్శి

పునరావాస కాలనీలకు 25 రకాల వసతులను ప్రభుత్వం కల్పించాల్సి ఉంది. ప్రాజెక్ట్ నిర్మాణానికి నిర్వాసితులు అడ్డుగా ఉన్నారనే సాకుతో అధికారులు బలవంతంగా, మాయమాటలు చెప్పి సొంత గ్రామాల నుంచి ఖాళీ చేయించి వసతుల్లేని కాలనీలకు తీసుకొచ్చి వదిలేయడం బాధాకరం. ప్రజా ప్రతినిధుల మెప్పుకోసం అధికారులు అత్యుత్సాహం ప్రదర్శించారు. కాలనీల్లో కనీసం తాగునీరు, వీధిలైట్లు, శ్మశానవాటికలు, డ్రెయినేజీ వంటి సౌకర్యాలు లేవు. నిర్వాసితులపట్ల ప్రభుత్వం వివక్ష చూపుతుంది.

రూ.10 లక్షల పరిహారం అందలేదు

కంగాల ఉదయ్ కుమార్, చిగురుమామిడి నిర్వాసిత కాలనీ

వైసిపి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మాకు ఇస్తామన్న రూ.10 లక్షల పరిహారం త్వరగా ఇవ్వాలి. వరద పరిహారం కూడా ఇచ్చి ఆదుకోండి. కాలనీలో కనీస వసతులు కల్పించాలి. ముంపుప్రాంతాలు ఖాళీ చేసే నాటికి 18 సంవత్సరాలు నిండిన వారికి ప్యాకేజీ ఇవ్వాలి.

పట్టెన్నపాలెం బ్రిడ్జి నిర్మించాలని టిడిపి జలదీక్ష

జలదీక్షలో టిడిపినేతలు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

పట్టెన్నపాలెం జల్లేరువాగుపై అసంపూర్తిగా నిర్మించిన బ్రిడ్జిని పూర్తిచేయాలని కోరుతూ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో నేతలు కాలువలోకి దిగి బుధవారం జలదీక్ష చేపట్టారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా పాల్గొన్న పోలవరం నియోజకవర్గ పార్టీ ఇన్‌ఛార్జి బొరగం శ్రీనివాసులు, టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ దాసరి శ్యామ్‌చంద్ర శేషు మాట్లాడుతూ గిరిజన ప్రాంతాలైన వేలేరుపాడు, కుక్కునూరు, బుట్టయగూడెం మండలాల నుంచి జంగారెడ్డిగూడెం వెళ్లేందుకు ప్రధాన రహదారి ఇదేనని, ప్రసిద్ధిగాంచిన గుబ్బల మంగమ్మ ఆలయానికి వెళ్లడానికి ప్రధానమార్గంలో జల్లేరుపై వంతెన నిర్మాణం నిలచిపోవడం వల్ల ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. వంతెన నిర్మాణానికి రీ ఎస్టిమేషన్ల తరువాత రూ.మూడు కోట్ల 20 లక్షలు బ్రిడ్జి నిర్మాణానికి, అలాగే మరో రూ.40 లక్షలతో అప్రోచ్ రోడ్డు నిర్మాణానికి బడ్జెట్‌లో నిధులు కేటాయించారని తెలిపారు. దీనిపై ప్రభుత్వ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా టెండర్ ఓపెన్‌లో ఉందని, ఎవరైనా గుత్తేదారు వస్తే పనులు పూర్తిచేస్తామని చెప్పడంతోనే సరిపోతుందన్నారు. గుత్తేదారుతో సంబంధం లేకుండా ప్రభుత్వమే పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రతి ఏటా వరద ప్రవాహంలో ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో పనులు త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు సాయల సత్యనారాయణ, బిసి సెల్ రాష్ట్ర కార్యదర్శి చిట్టిబోయిన రామలింగేశ్వరరావు, భీమేశ్వరరావు, ఆకుల దుర్గారావు, బొబ్బర ఎలిషా, పసుపులేటి సూర్యచంద్రరావు, ఎలికే ప్రసాద్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్ట్‌కు రూ.4 లక్షల విరాళం

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయ శాశ్వత నిత్య అన్నదాన ట్రస్ట్‌కు కృష్ణాజిల్లా జిల్లా బాపులపాడు మండలం వేలేరు గ్రామానికి చెందిన శ్రీవెంకటేశ్వర అవిర్నేని తారక బ్రహ్మం అండ్ దోనవల్లి పుష్పావతి ఛారిటబుల్ ట్రస్ట్ వారు బుధవారం రూ.నాలుగు లక్షల విరాళం అందించారు. ఆలయ ఛైర్మన్ ఎస్‌వి.సుధాకర్‌రావుకు యూనియన్ బ్యాంక్ చెక్కుద్వారా ఈ విరాళం అందించారు. అనంతరం దాత కుటుంబ సభ్యులు స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. వీరికి విరాళానికి సంబంధించిన బాండ్‌ను అందించారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

ప్రజాశక్తి - కలిదిండి

ప్రభుత్వ నిధులతో గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని ఎంఎల్‌ఎ దూలం నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని సానా రుద్రవరంలో రూ.15 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్ల నిర్మాణానికి శంఖుస్థాపన చేశారు. తొలుత మండలంలోని కోరుకొల్లులో రూ.30 లక్షలతో ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘ గొడౌన్ భవన నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి చందన ఉమామహేశ్వరరావు, సర్పంచి నున్న రాజేశ్వరి, పిఎసిఎస్ అధ్యక్షులు వడ్లాని పార్థసారథి, అంకెం నరసయ్య, ఎఎంసి మాజీ ఛైర్మన్ నీలపాల వెంకటేశ్వరరావు, సొసైటీ మాజీ అధ్యక్షులు చిట్టూరి బుజ్జి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్‌టిసి బస్సులకు మెడికల్ కిట్లు వితరణ

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

80 ఆర్‌టిసి బస్సులకు ఫస్ట్ ఎయిడ్ మెడికల్ కిట్లను ప్రముఖ దంత వైద్య నిపుణులు దినేష్ ఆధ్వర్యంలో బుధవారం అందించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ పవన్ కుమార్ మాట్లాడుతూ దినేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. దినేష్ మాట్లాడుతూ అత్యవసర సమయాల్లో మెడికల్ కిట్లు ఎంతో ఉపయోగపడతాయని, ప్రతిఒక్క బస్సులోనూ మెడికల్ కిట్టు ఉండాలని ఆయన ఆకాంక్షించారు.

వైభవంగా జగన్నాథ రథయాత్ర

నూజివీడు రూరల్: రాజీవ్ సర్కిల్ సమీపంలోని రోడ్లు, భవనాల శాఖ అతిథి గృహం నుంచి బుధవారం పూరీ జగన్నాథ రథయాత్ర ప్రారంభమైంది. ఎంఎల్‌ఎ మేకా వెంకట ప్రతాప్ అప్పారావు, డిఎస్‌పి అశోక్ కుమార్ గౌడ్, మున్సిపల్ వైస్ ఛైర్మన్ పగడాల సత్యనారాయణ రథయాత్రను ప్రారంభించారు. బస్టాండ్ సెంటర్, చిన్న గాంధీ బొమ్మ సెంటర్, పెద్ద గాంధీ బొమ్మ సెంటర్ మీదుగా రథయాత్ర సాగింది.

రూ.8.40 లక్షలతో సిగ్నల్ లైట్లు

ఏలూరు టౌన్: మరమ్మతులకు గురైన సిగ్నల్ లైట్ల స్థానంలో అత్యాధుని టెక్నాలజీ కలిగిన నూతన సిగ్నల్ వ్యవస్థను నగర ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చామని నగరపాలక సంస్థ కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ తెలిపారు. ఇటీవల సిగ్నల్ లైట్లు మరమ్మతులకు గురవ్వడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ఈ క్రమంలో రూ.8.40 లక్షల వ్యయంతో నూతన టెక్నాలజీ కలిగిన సిగ్నల్ లైట్లు అమర్చి వాటిని ఉపయోగంలోకి తీసుకొచ్చామని తెలిపారు. సిగ్నల్ పడిన సమయంలో వాహనదారులందరూ ఇంజిన్‌ను ఆపాలని తద్వారా ఇంధనం పొదుపు చేయడంతో పాటు పర్యావరణానికి కూడా మేలు కలుగుతుందని కమిషనర్ తెలిపారు.

నేరాలు - ఘోరాలు

అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ సీజ్

టి.నరసాపురం: ఇసుక అక్రమ రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసి వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కె.సతీష్‌కుమార్ తెలిపారు. బుధవారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని ఏపిగుంట పంచాయతీ మల్లప్పగూడేనికి చెందిన పొట్ట వెంకన్నబాబు అనుమతుల్లేకుండా ఎర్రకాలువలోని ఇసుకను అక్రమంగా తరలివస్తున్నారనే సమాచారంతో తన సిబ్బందితో ఏపిగుంట గ్రామ శివార్లలో దాడి చేసినట్లు చెప్పారు. ట్రాక్టర్, ట్రక్కు, యూనిట్ ఇసుకను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

మద్యం అక్రమ వ్యాపారులు అరెస్టు

కైకలూరు: గోవా నుంచి కైకలూరు ప్రాంతానికి మద్యం అక్రమ రవాణా చేస్తున్న మహిళలను అరెస్టు చేసినట్లు పట్టణ ఎస్‌ఐ జి.జ్యోతిబాబు తెలిపారు. స్థానిక సిఐ కార్యాలయంలో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో సిఐ కేసు వివరాలు తెలిపారు. బాపట్ల జిల్లా చీరాల ఓడరేవుల గ్రామానికి చెందిన ముగ్గురు మహిళలు గోవా నుంచి ముంబై ఎల్‌టిటి రైలులో 24 బ్యాగుల్లో 280 మద్యం సీసాలు తరలిస్తుండగా అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో సిఐ రఘు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళను బెదిరించిన వ్యక్తిపై కేసు

టి.నరసాపురం : కులం పేరుతో ధూషించి, చంపుతానని బెదిరించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కె.సతీష్ కుమార్ బుధవారం తెలిపారు. బొర్రంపాలెం గ్రామం శ్రీనగర్ కాలనీకి చెందిన మహిళ అదే గ్రామానికి చెందిన గొగ్గి పూర్ణచంద్రరావుకు వ్యవసాయ ఖర్చుల నిమిత్తం 2021 అక్టోబర్‌లో రూ.3 లక్షలు అప్పుగా ఇచ్చింది. ఇటీవల ఆమె కుమార్తె అనారోగ్యం బారిన పడటంతో పూర్ణచంద్రరావు దగ్గరకు వెళ్లి తనకు ఇవ్వాల్సిన డబ్బులు అడిగింది. దీనికి అతను ఆమె పట్ల అసభ్యకరంగా ప్రవర్తించి, చంపేస్తానని బెదిరించి, కులం పేరుతో దూషించినట్లు మహిళ పోలీసులను ఆశ్రయించింది. ఆమె ఫిర్యాదు మేరకు పోక్సో కేసు నమోదు చేశారు. పోలవరం డిఎస్‌పి ఎ.శ్రీనివాసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆయిల్‌పామ్ మొక్కలు ధ్వంసం
పలువురిపై కేసు

టి.నరసాపురం : అక్రమంగా తోటలోకి ప్రవేశించి ఆయిల్‌పామ్ మొక్కలు నరికిన వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కె.సతీష్ కుమార్ బుధవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం తెలంగాణ రాష్ట్రం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట గ్రామానికి చెందిన రావు శ్రీధర్ మండలంలోని మర్రిగూడెం గ్రామ పరిధిలో తనకు గల 4.5 ఎకరాల భూమిలో ఆరు నెలల క్రితం ఆయిల్‌పామ్ మొక్కలు వేశాడు. ఈ నెల 27 న మధ్యాహ్నం ఆ మొక్కల్ని చూడటానికి తోటకు వెళ్లగా గుర్తుతెలియని వ్యక్తులు అక్రమంగా తన తోటలోకి ప్రవేశించి, సుమారు 300 మొక్కలు నరికివేశారని, రూ.లక్ష నష్టం కలిగించినట్లు శ్రీధర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్ననట్లు పోలీసులు తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం

పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి

ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190

పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

అధికారుల నిర్లక్ష్యం.. డ్రెయిన్లు అస్తవ్యస్తం..!

నెలలు తరబడి పేరుకుపోయిన సిల్టు
రోడ్లపైకి చేరుతున్న మురుగునీరు
ప్రజల అవస్థలు
పట్టించుకోని పంచాయతీ అధికారులు

రోడ్డుపైకి చేరిన మురుగునీరు

ప్రజాశక్తి - మండవల్లి

స్థానిక పంచాయతీ అధికారుల నిర్లక్ష్యంతో రోడ్లు మురికికూపాలుగా మారుతున్నాయి. ఇళ్లల్లోని మురుగు నీరు రహదారులపైకి చేరుతోంది. ఈ నీటిని తొలగించేలా పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టకపోవడంతో నెలల తరబడి సిమెంట్ రోడ్లపై నిల్వ ఉంటున్నాయి. దీంతో పాకుడుపట్టి రోడ్డుపై నడిచేందుకు కూడా గ్రామస్తులు నానా అవస్థలు పడుతున్న ఘటన మండవల్లి ఎస్‌సి కాలనీలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం మండవల్లిలోని జాతీయ రహదారి వెంబడి స్టేషన్ రోడ్డు నుండి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వరకూ డ్రెయినేజీ వ్యవస్థ ఉంది. ఆ ప్రాంత నివాసాల్లోని మురుగునీరు డ్రెయినేజీ ద్వారా ప్రవహించి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలోని మెయిన్ డ్రెయిన్‌లో కలుస్తుంది. అయితే ఈ డ్రెయినేజీలో పూడికతీత పనులను పంచాయతీ సక్రమంగా నిర్వహించకపోవడంతో డ్రెయినేజీ పూడుకుపోయి మురుగుపారేందుకు అడ్డంకిగా మారింది. దీంతో మురుగు పొంగి బిసి బాలికల వసతి గృహానికి వెళ్లే రహదారితో పాటు మంచాల తయారీ కాలనీలోని మరో రెండు రహదారుల పైకి చేరుతుంది. మండు వేసవిలో కూడా మురుగునీరు రోడ్లపై నిల్వ ఉంటుందని, రోడ్లపై ప్రయాణించేందుకు నానాఅవస్థలు పడుతున్నామని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో వర్షపు నీటితో మురుగునీరు కలిసి నివాసాల చుట్టూ చేరుతున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయినప్పటికీ పంచాయతీ అధికారులు మురుగునీరు పోయేలా చర్యలు చేపట్టకపోవడంతో సిమెంట్ రోడ్డుపై పాకుడు పట్టి చిన్నారులు నిత్యం జారిపడుతున్నారని గ్రామస్తులు తెలిపారు. ఈ సమస్యను పరిష్కరించాలని పలుమార్లు పంచాయతీ అధికారులను కోరినప్పటికీ అదిగో.. ఇదిగో.. అంటూ కాలయాపన చేస్తున్నారు తప్ప డ్రెయినేజీని అభివృద్ధి చేయడం లేదని అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి మురుగునీరు రహదారులపై నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. దీనిపై కార్యదర్శి తోట శ్రీనివాస్‌ను వివరణ కోరగా పరిశీలించి సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతామని చెప్పారు.

సహాయమాత విద్యార్థికి నవోదయలో సీటు

సీటు సాధించిన కౌశిక్

ప్రజాశక్తి - ముదినేపల్లి

జవహర్ నవోదయ పాఠశాలలో ఆరో తరగతి ప్రవేశానికి జరిగిన ప్రవేశ పరీక్షలో సహాయమాత స్కూల్ విద్యార్థి ఎల్.కౌశిక్ సీటు సాధించినట్లు స్కూల్ కరస్పాంటెండెంట్ సిస్టర్ క్రిస్టి తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలలో బుధవారం జరిగిన కార్యక్రమంలో కౌశిక్‌ను కరస్పాండెంట్, స్కూల్ ప్రిన్సిపల్ సిస్టర్ లిన్సా, ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు. వడాలికి చెందిన ఎల్.కౌశిక్ స్థానిక వియాన్ కాంపిటేటివ్ కోచింగ్ సెంటర్‌లో జవహర్ నవోదయ ప్రవేశ పరీక్షకు శిక్షణ తీసుకున్నాడు. ఈ సందర్భంగా కోచింగ్ సెంటర్ వ్యవస్థాపకులు జొన్నలగడ్డ కళ్యాణ్ చక్రవర్తి మాట్లాడుతూ తొలిసారిగా తమ కోచింగ్ సెంటర్ నుంచి కౌశిక్ నవోదయలో సీటు సాధించడం సంతోషదాయకమన్నారు. ఈ సందర్భంగా కౌశిక్‌ను పలువురు ప్రముఖులు, విద్యావేత్తలు అభినందించారు.

టిడిపి నేత భోగేశ్వరరావుకు పితృవియోగం

నాగేశ్వరరావు(ఫైల్)

ప్రజాశక్తి - కలిదిండి

పెదలంక గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకులు ముద్దం భోగేశ్వరరావు తండ్రి ముద్దం నాగేశ్వరరావు(85) అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలున్నారు. నాగేశ్వరరావు మృతదేహాన్ని టిడిపి మండల అధ్యక్షులు పోకల జోగిరాజు, నాయకులు పెటేటి సత్యన్నారాయణ, కోకా శ్రీనివాసరావు, పెదలంక ఆలయ ఛైర్మన్ ఐనాల సత్యన్నారాయణ, వాసురాజు, మంతెన రామరాజు, దున్న భోగేశ్వరరావు, గ్రామ ప్రముఖులు సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు.

వాటర్‌ప్లాంట్ ధ్వంసంపై గ్రామస్తుల ధర్నా

ప్రజాశక్తి - నిడమర్రు

మండలంలోని క్రొవ్విడిలో స్వజలధారలో భాగంగా ఏర్పాటు చేసిన వాటర్‌ప్లాంట్‌ను వైఎస్‌ఆర్ విగ్రహం ఏర్పాటు చేసేందుకు వైసిపి నాయకులు ధ్వంసం చేయడాన్ని నిరసిస్తూ గ్రామస్తులు బుధవారం ఆందోళన చేపట్టారు. గత కాంగ్రెస్ హయాంలో పర్యాటక శాఖ మంత్రి వట్టి వసంత కుమార్ అప్పటి ప్రభుత్వం నిధులతో వాటర్‌ప్లాంట్‌ను ఏర్పాటు చేశారని గ్రామస్తులు తెలిపారు. నేడు అధికారపార్టీ నాయకులు వాటర్‌ప్లాంట్‌లోని సామగ్రిని ధ్వంసం చేసి ఊరిచివర పడవేయడం సరికాదన్నారు. ఈ ఆందోళనలో టిడిపి నాయకులు గన్ని వీరాంజనేయులు, ఇతర నాయకులతోపాటు సిపిఎం నాయకులు ఆందోళనలో పాల్గొని సంఘీభావం తెలిపారు. దీంతో తహశీల్దార్, ఎంపిడిఒ ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేసి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఆందోళనలో సిపిఎం నాయకులు నారపల్లి రమణారావు. కోన శ్రీనివాసరావు, తెలుగుదేశం పార్టీ నాయకులు ఆరిమిల్లి కనకారావు, షేక్ గఫార్‌ఖాన్, తాడి శ్రీనివాసరావు, పుప్పాల నారాయణస్వామి, సారిక లెనిన్ పాల్గొన్నారు.

ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి : సిపిఎం

ప్లాంట్‌ను ధ్వంసం చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సిపిఎం డిమాండ్ చేసింది. నిడమర్రులోని ప్రజా సంఘాల కార్యాలయంలో. పార్టీ మండల కమిటీ సమావేశం కోన శ్రీనివాస్ అధ్యక్షతన జరిగింది. క్రొవ్విడిలో జరిగిన ఘటనను ఖండిస్తూ గ్రామంలో ప్రజలు తాగడానికి నీరులేకుండా చేసి స్వజలధార వాటర్‌ప్లాంట్‌ను ధ్వంసం చేసిన వారిపై ప్రభుత్వం చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ ఆస్తిని ధ్వంసం, నష్టం చేసిన వారితోనే నష్టపరిహారం. చెల్లించేలా, యథాస్థానంలో వాటర్ ప్లాంట్ నిర్మించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేస్తుంటే తమకు సంబంధం లేనట్టు వ్యవహరించిన పంచాయతీ కార్యదర్శిని, విఆర్‌ఒలను సస్పెండ్ చేయాలని కోరారు. ఇలాంటి ఘటనలకు పునరావృతం కాకుండా వారిపై పోలీస్ కేసులు పెట్టి కఠినంగా శిక్షించాలని, వాటర్‌ప్లాంట్ నిర్మాణం జరిగే వరకూ గ్రామ ప్రజలకు రెండు పూటలా తాగునీటిని సరఫరా చేయాలని సిపిఎం డిమాండ్ చేశారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయాంలో తహశీల్దార్ సాయిరాజ్‌కు వినతిపత్రం అందించారు.. ఈ కార్యక్రమంలో నారపల్లి రమణారావు. గవర సత్యనారాయణ, లావేటి చంద్రరావు, ఎం.బాపిరాజు, పిల్ల సూరిబాబు పాల్గొన్నారు.

వైసిపి హయాంలో అభివృద్ధి శూన్యం : టిడిపి

ముసునూరు : వైసిపి హయాంలో రాష్ట్ర అభివృద్ధి క్షీణించిందని నూజివీడు నియోజక వర్గ టిడిపి ఇన్‌ఛార్జి ముద్దరబోయిన వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం రమణక్కపేటలో భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు అధికారంలో ఉంటే రాజధాని నిర్మాణం, పోలవరం ప్రాజెక్టు, చింతలపూడి ఎత్తిపోతల పథకాలు పూర్తయ్యేవన్నారు. ఎస్‌సి, ఎస్‌టి కాంరొరేషన్ల రుణాలు లేవన్నారు. ఫారెస్టు, పోరంబోకు భూముల ఆక్రమణ ఎక్కువైందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు దేవినేని బలరాం, మండల ప్రధాన కార్యదర్శి కందుల పిచ్చియ్య, పార్టీ గ్రామ అధ్యక్షులు రంగు ఆంజనేయులు, సురేంద్ర పాల్గొన్నారు.

పవన్ వ్యూహం ఏమిటో..!

- భీమవరంలో జనసేనాని ఐదు రోజుల బసపై సర్వత్రా చర్చ
- ఓడిన చోట విజయఢంకా మోగించాలనే యోచనలో జనసేన ఎత్తుగడ
- ముఖ్య నేతలతో సమావేశాలు.. కీలక చర్చలు
- ఎన్నికలు రాకముందే వేడెక్కిన జిల్లా రాజకీయం

ప్రజాశక్తి - భీమవరం

జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ వ్యూహం ఏమిటీ.. ఐదు రోజులు ఇక్కడే బస చేయడానికి కారణం ఏమిటీ.. అసలు భీమవరానికి ఎందుకంత ప్రాధాన్యత ఇస్తున్నారు.. ఓడిన చోటే విజయఢంకా మోగించాలనే ఎత్తుగడతో జనసేనాని ముందుక సాగుతున్నారా.. ముఖ్యనేతలతో అంతర్గత సమావేశాల వెనుక ఆంతర్యమేమిటీ.. అసలు భీమవరంలో ఏం జరుగుతుందా అని జనంలో చర్చ సాగుతోంది. ఈ నేపథ్యంలో ఎన్నికలు రాకముందే జిల్లాలో రాజకీయ వాతావరణం వేడెక్కింది. జనసేన ప్రధానంగా ఇక్కడే కేంద్రీకరించడంతో ఉభయగోదావరి జిల్లాల చుట్టూ రాష్ట్ర రాజకీయం తిరుగుతోంది.



గత ఎన్నికలతో పోలిస్తే జిల్లాలో జనసేన బలపడింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో గోదావరి జిల్లాల్లో జనసేన కొంత ప్రభావం చూపింది. ఈ జిల్లాల్లో కాపు సామాజిక తరగతికి చెందిన వారు ఉండటమే దీనికి కారణమని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. జనసేనాని పవన్ కూడా పదేపదే ఈసారి అసెంబ్లీలో అడుగు పెడతామని చెబుతుండటం, ఇది సాధ్యం కావాలంటే తన సామాజికతరగతి ఎక్కువ శాతం ఉన్న ఉభయగోదావరి జిల్లాల నుంచే సాధ్యమవుతుందని, ఆ విధంగా జనసేన ప్రణాళిక రచించిందనే చర్చ సర్వత్రా సాగుతోంది. రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని జనసేన వారాహి విజయయాత్ర చేపట్టింది. ప్రధానంగా ఉభయగోదావరి జిల్లాల్లోని 34 నియోజకవర్గాలపై కేంద్రీకరించిన జనసేన తూర్పుగోదావరి జిల్లా అన్నవరం నుంచి ఈ నెల 14న వారాహి యాత్ర ప్రారంభించిన సంగతి తెలిసిందే. తూర్పుగోదావరి జిల్లాలో పర్యటన పూర్తి చేసుకుని నరసాపురం సభ అనంతరం ఈ నెల 26వ తేదీ రాత్రికి భీమవరం చేరుకున్న పవన్ ఇక్కడే మకాం వేశారు. స్వల్ప అస్వస్థతకు గురైన పవన్ విశ్రాంతి అవసరమని భావించి ఇక్కడే ఉండిపోయారని పార్టీ నేతలు చెబుతున్నప్పటికీ రాజకీయ కోణం ఉందని విశ్లేషకులు చెబుతున్నారు.

పశ్చిమలో పట్టుకు తహతహ

జిల్లాల పునర్విభజన్లో ఏర్పాటైన పశ్చిమగోదావరి జిల్లాలో పట్టు సాధించేందుకు జనసేన తహతహలాడుతోంది. జిల్లా కేంద్రం భీమవరంలో జనసేనానికి మకాం వేయడానికి కారణం ఇదేననే చర్చ పెద్దఎత్తున సాగుతోంది. దీనిలో భాగంగానే ఉమ్మడి పశ్చిమగోదావరి నేతలతో చర్చలు జరిపి భీమవరంలో పవన్ బహిరంగ సభ ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నారు. భీమవరంలో పవన్ పర్యటన ఒక్కరోజే ఉంటుందని జనసేన నేతలు ముందుగా చెప్పినప్పటికీ, పవన్ అస్వస్థత, తాజాగా సభ పేరిట ఇక్కడే మకాం వేయడం వెనుక ఆంతర్యం వేరే అనే చర్చలు సాగుతున్నాయి. ప్రధానంగా జిల్లాలో భీమవరం, నరసాపురం, తాడేపల్లిగూడెం నియోజకవర్గాల్లో జనసేనకు బలంగా ఉన్నట్లు ఆ పార్టీ నేతలు భావిస్తున్నారు. గత ఎన్నికల్లో భీమవరంలో పోటీ చేసిన పవన్‌కళ్యాణ్ 62,285 ఓట్లుతో రెండో స్థానంలో నిలిచారు. నరసాపురంలో బొమ్మిడి నాయకర్ 49,120 ఓట్లుతో రెండో స్థానంలో నిలవగా, తాడేపల్లిగూడెంలో బొలిశెట్టి శ్రీనివాస్ 36,970 ఓట్లుతో మూడో స్థానంలో నిలిచారు.

భీమవరానికే ఎందుకంత ప్రాధాన్యత!

గత ఎన్నికల్లో పవన్ భీమవరం, గాజువాక నుంచి పోటీ చేసి పరాజయం పొందినప్పటికీ భీమవరం వైపే దృష్టి కేంద్రీకరించారు. వచ్చే ఎన్నికల్లో భీమవరంలో జనసేన జెండా ఎగురవేయాలని పవన్ కంకణం కట్టుకున్నారనే ప్రచారం సాగుతోంది. ఈ నేపథ్యంలోనే భీమవరానికి రాష్ట్రంలో ఎక్కడా లేని ప్రాధాన్యత ఇస్తున్నారనేది రాజకీయ విశ్లేషకుల అంచనా. గత ఎన్నికల్లో భీమవరం నియోజకవర్గం నుంచి వైసిపి, జనసేన, టిడిపి నడుమ త్రిముఖ పోటీ జరిగింది. అప్పటి గణాంకాల ప్రకారం నియోజకవర్గంలో 2,46,342 మంది ఓటర్లుండగా మొత్తం 1,92,061 ఓట్లు పోలయ్యాయి. వైసిపి అభ్యర్థి గ్రంధి శ్రీనివాస్‌కు 70,642 ఓట్లు (36.78 శాతం), వామపక్షాల మద్దతుతో బరిలో నిలిచిన జనసేన అభ్యర్థి కొణిదెల పవన్‌కళ్యాణ్‌కు 62,285 ఓట్లు (32.43 శాతం), టిడిపి అభ్యర్థి పులపర్తి రామాంజనేయులకు 54,037 ఓట్లు (28.14 శాతం) వచ్చాయి. వైసిపి అభ్యర్థి గ్రంధి శ్రీనివాస్ 8,357 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. పోయినచోటే వెతుక్కోవాలనే చందంగా జనసేనాని ఈసారి ఎన్నికల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ భీమవరంలో పాగా వేయాలనే ఆలోచనతో ముందుకు సాగుతున్నట్లు తెలుస్తోంది.

వేడెక్కిన రాజకీయం..

ఎన్నికలకు ఏడాది ముందే జిల్లాలో రాజకీయం వేడెక్కింది. రానున్న ఎన్నికల్లో బలాబలాలు నిరూపించుకునేందుకు ప్రధాన పార్టీలు ఇప్పటి నుంచే పోటీ పడుతున్నాయి. టిడిపి, వైసిపి, జనసేన పార్టీలు ఇప్పటి నుంచే వ్యూహాలు రచిస్తున్నాయి. వైసిపి గడపగడపకు తిరుగుతూ ప్రజలతో మమేకమవుతుంది. టిడిపి ఇప్పటికే జిల్లాలో రైతు పోరుయాత్ర పేరిట పాదయాత్ర నిర్వహించింది. జనసేన వారాహి యాత్ర పేరుతో జిల్లాలో ముఖ్య నేతలతో సమావేశాలు, బహిరంగ సభలతో క్షణం తీరిక లేకుండా ముందుకు సాగుతోంది. ఇక వామపక్షాలు ప్రధానంగా సిపిఎం ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ ప్రజల గొంతుకలా నినదిస్తూనే ఉద్యమాలు సాగిస్తోంది. ఇదిలా ఉంటే జనసేన అధినేత ఇక్కడ ఐదు రోజులు బస చేయడం అందరి చూపు పశ్చిమగోదావరి వైపు, ప్రధానంగా భీమవరంవైపు పడిందని చెప్పొచ్చు. ఈ నేపథ్యంలో పవన్ కీలక ప్రకటనలు ఏమైనా చేస్తారో లేదో 30న సభ వరకూ వేచిచూడాలి.

అగ్ని ప్రమాద బాధితునికి సాయం

ప్రజాశక్తి - ముదినేపల్లి

విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా మంగళవారం అర్ధరాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధిత కుటుంబ సభ్యులను బుధవారం పలువురు పరామర్శించి ఆర్థికసాయం అందచేశారు. స్థానిక మూడో బజారుకు చెందిన ఉప్పల కోదండరామయ్య తాటాకు ఇల్లు దగ్ధమై ఇంటిలోని గృహోపకరణాలతో పాటు, విలువైన వస్తువులు, రూ.30 వేలు నగదు మంటల్లో కాలి బూడిదయ్యాయి. ఈ ప్రమాదంలో సుమారు రూ.మూడు లక్షల మేర ఆస్తి నష్టం జరిగినట్లు బాధితుడు కోదండరామయ్య తెలిపారు. విషయం తెలుసుకున్న ముదినేపల్లి జెడ్‌పిటిసి దంపతులు ఈడే వెంకటేశ్వరరావు, గ్రామ సర్పంచి నిమ్మగడ్డ కైకమ్మ, నిమ్మగడ్డ భిక్షాలు, బాధిత కుటుంబసభ్యులను పరామర్శించి రూ.ఏడు వేలు నగదు, నిత్యావసర సరుకులు అందచేశారు. ఈ కార్యక్రమంలో ఈడే ఉమ, ఈడే శ్రీనివాసరావు, పల్లెం పుణ్యేశ్వరరావు, జన్ను రాంబాబు పాల్గొన్నారు.

MUNICIPAL CORPORATION, ELURU

e-PROCUREMENT TENDER NOTICE No: 146-155/GGMP-Grant & General/2023-24, Dated. 28-6-2023

The Commissioner, Municipal Corporation, Eluru invites tenders from interested, eligible bidders for **"Construction of Toilets, Providing new bore well, Electrification of Sachivalayam Building, Providing of Firefighting Accessories, Supply, Delivery, Commissioning and Testing of PTZ CC Cameras, Providing Wet Mix Road, Providing CC Culverts, Supply of Tractor Engines to Vehicle Depo in Municipal Corporation, Eluru"** Total No of works is **10** with an amount of Rs. **68.48** Lakhs.

Tender schedules are available on e-procurement market place from 01-07-2023. Last date of receipt of tenders is 05-07-2023. Further details can be seen at e-procurement market place at **www.apeprocurement.gov.in** or contact Commissioner, Municipal Corporation, Eluru, Eluru District (Phone / Fax: 08812 - 245990).

Sd/- **COMMISSIONER**
MUNICIPAL CORPORATION, ELURU

పాస్‌పోర్టు పోయినది

పశ్చిమగోదావరి జిల్లా, పెనుమంట్ర మండలం, పెనుమంట్ర గ్రామం కాపురస్తుడైన పాకేర్ల పవన్‌కుమార్, తండ్రి: భాస్కరరావు అను నాకు **L7228552** నెంబరు గల పాస్‌పోర్టు గత నెల ది. 15-05-2023వ తేదీన మోటారు సైకిల్‌పై పెనుమంట్ర గ్రామం నుండి మార్టేరు వెళ్ళుచుండగా మార్గ మధ్యలో ఎక్కడో పాస్‌పోర్టు కలిగి ఉన్న కవరు పడిపోయినది. కావున దొరికినవారు ఈక్రింది అడ్రసుకు తెలియజేయగలరు.

పాకేర్ల పవన్‌కుమార్
తండ్రి: భాస్కరరావు
డోర్ నెంబర్: 3-59
పెనుమంట్ర గ్రామం, పెనుమంట్ర మండలం
పశ్చిమగోదావరి జిల్లా, పిన్‌కోడ్: 534124
సెల్: 8838446970

In The Court Of The Principal Junior Civil Judge :: Tanuku
O.S.No. 354/2020

Between:
Bank of Baroda (Erstwhile Vijaya Bank), Alamuru ***...Plaintiff***
VS
Thonta Suryanarayana another ***...Defendant***

వాది తరుపున చేసిన ప్రకటన

ప్రతివాదులు:
1) తొంట సూర్యనారాయణ, తండ్రి: వెంకట క్రిష్ణ మూర్తి, హిందువు, పురుషుడు, కంతేరు, H/o. అడవిపాలెం, యలమంచిలి మండలం.
2) వేముల జయరాజు, తండ్రి: యర్రియ్య, హిందువు, పురుషుడు, గగ్గిపర్రు, యలమంచిలి మండలం.

పై నెంబరు దావా గ్రంధములో ప్రతివాదులైన మీకు ఎన్ని పర్యాయములు సమన్లు పంపించిననూ మీకు అమలు జరగనందున శ్రీ కోర్టు వారి ఆదేశముల ప్రకారం ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయడమైనది ఏమనగా మీరు **ది.03-07-2023వ తేదీన ఉదయం గం॥ 10:30 ని॥లకు స్వయంగా గాని, ప్లీడరు ద్వారా గాని పై కోర్టు నందు హాజరై మీ తాలూకా ఆక్షేపణలు తెలియజేసుకొనవలసినదిగాను** అట్లు కాని ఎడల మీ పరోక్షమున తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియపర్చడమైనది.

D.S.V.KRISHNAJI
Advocate, Tanuku.

కోర్టు నోటీసు
మహారాజశ్రీ పశ్చిమగోదావరి జిల్లా, ఏలూరు VIIth Additional District Judge (Family) కోర్టులో
Hindu Marriage O.P. No. 102/2022

Between:
Gude Ramana, S/o. Venkateswarlu, D.No. 4-37A, Pulikonda (Post), చీమకుర్తి మండలం, ప్రకాశం జిల్లా-523226. **-పిటీషనరు**
AND
Smt. Gude Aishwarya, W/o. Ramana, D/o. Ashim Chakravarthi, D.No. 2/149, Backside of Panchayat Office, Water Tank Road, సత్రంపాడు, ఏలూరు, ప॥గో॥జిల్లా.

పిటీషనరు అయిన Gude Ramana మీ పయ్ని H.M.O.P. No. 102/2022 Under Section 13(1) (19) on the Grant of Crulty పయ్ని మీకు పిటీషనరుకు జరిగిన ది. 09-3-2019వ తేదీన జరిగిన వివాహాన్ని రద్దుపరచి మీపయ్ని Divorce యిప్పించవలసినదిగా పై కోర్టులో H.M.O.P. No. 102/2022 దాఖలు చేయగా అందు పయ్ని మీకు పై అడ్రసుకు చాలా పర్యాయములు కోర్టు ద్వారా, పోస్టల్ ద్వారా నోటీసులు తీసుకోవలసిందిగా కోర్టు నోటీసులు పంపించినా మీరు తీసుకోనందున, మీకు అమలు జరగనందున పై కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం ఈ పేపరు జిల్లా ప్రకటన ద్వారా ఈ నోటీసు పంపించడమైనది.

కావున మీరు **ది. 05-7-2023వ తేదీన** వకీలు ద్వారా గాని, స్వయంగా గాని హాజరై మీ అభ్యంతరములు, మీ వాదనలు దాఖలు చేసుకోవలసినదిగా యిందుమూలముగా మీకు తెలియజేయడమైనది. అట్లు మీరు జరిగించని ఎడల మీ పరోక్షమున తీర్మానించబడునని యిందు మూలముగా మీకు తెలియజేయడమైనది.

(పై కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

GUN LAW ASSOCIATES
GADILLI UGRANARASIMHA RAO
GADILLI L.N.S.SURYA TEJA
Advocates, Eluru
ఏలూరు
ది. 19-5-2023
Cell: 9966914954

ప్రకటన
మహారాజశ్రీ తణుకు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఓ.ఎస్.నెం. 205/2022

వాది: గుండుబోయిన వెంకట ధనలక్ష్మి
అండ్

ప్రతివాద్దు:
1) పెనుమత్స రుక్మిణీ దేవి, భర్త: లేటు వెంకట సత్యసన్యాసి బాబా రవికుమార్ వర్మ, 43 సం॥లు, హిందు, గృహిణి, డో.నెం. 2-115, ఓదూరు గ్రామం, పెనుమంట్ర మండలం, తణుకు జె.సి.జె.
2) పెనుమత్స వెంకట రామరాజన్ వర్మ, తండ్రి: లేటు వెంకట సత్యసన్యాసి బాబా రవికుమార్ వర్మ, 36 సం॥లు, హిందు, ప్రైవేటు ఉద్యోగము, డో.నెం. 2-115, ఓదూరు గ్రామం, పెనుమంట్ర మండలం, తణుకు జె.సి.జె.
3) కలిదిండి శ్రీసూర్య సావిత్రి సుబద్రాదేవి, భర్త: రామసత్య సునీల్, తండ్రి: లేటు వెంకట సత్యసన్యాసి బాబా రవికుమార్ వర్మ, డో.నెం. 2-115, ఓదూరు గ్రామం, పెనుమంట్ర మండలం, తణుకు జె.సి.జె.

మీలో 1వ వారు లేటు పెన్మెత్స వెంకట సత్య సన్యాసిబాబా రవికుమార్ వర్మ గార్కి భార్య గారునూ 2వ వారు కుమారుడు, 3వ వారు కుమార్తె అయి ఉన్నారు. లేటు వెంకట సత్య సన్యాసిబాబాగారు వారి జీవిత కాలములో ది.29-03-2019 సం॥రం తేదీన వాది వద్ద ప్రాంశరీ నోటుపై తీసుకున్న రూ.3,50,000/- బాకీ తీర్చకుండా చనిపోయినందున ఆయనకు వారసులు అయిన మీపై దావా ప్రోనోటు బాకీ రికవరీ నిమిత్తం దాఖలు చేసిన పై నెంబరు దావా నందు మరియూ దావా బాకీనకు హామీగా 1వ వారి భర్త 2,3 వార్ల తండ్రి గారి ద్వారా సంక్రమించిన ఆస్థిని తోడజప్తు చేయించమని కోరుచూ దాఖలు చేసిన ఐ.ఎ.నెం. 376/22 పిటీషనునందు రెస్పాండెంట్లు /ప్రతివాదులు అయిన మీకు కోర్టు ద్వారానూ, పోస్టు ద్వారాను ఎన్నిసార్లు సమన్లు, నోటీసులు పంపిననూ అమలు జరగని కారణంగా Substitute Of Service ద్వారా అమలు జరుగు నిమిత్తం **ది.03-07-2023 సం॥రం తేదీనకు వాయిదా వేసియున్నారు. ఆరోజు ఉదయం గం॥ 10:30 ని॥లకు పై కోర్టు వారి ఎదుట హాజరై మీ ఆక్షేపణలు తెలియపర్చుకోవలెను.** లేని ఎడల మీ పరోక్షమందు తీర్మానించబడునని తెలియజేయడమైనది.

//By Order//

శ్రీ వి.ఎన్.శ్రీనివాసరెడ్డి
డి.హెచ్.ఆర్. తరుపు న్యాయవాది, తణుకు. సెల్: 94410 35648

డి.కృష్ణకుమారి
అడ్వకేట్, తణుకు. సెల్: 83093 92488
తణుకు, 28-6-23.